
చల్లకవ్వం



సోమేపల్లి వెంకటసుబ్బయ్య

చల్లకవ్వం

వచన కవితా సంకలనం



చల్లకవ్వం
CHALLAKAVVAM

By
SOMEPALLI VENKATA SUBBIAH

First Edition : **April 2002**
Copies : 1000

Cover Design
UDAY KUMAR

Price : Rs. 30/-

For Copies :
VISALANDHRA PUBLISHING HOUSE
4-1-435, Bank Street
Vignan Bhavan, Hyderabad - 500 001
and all its Branches

PRAJASAKTHI Publishing House
1-8-52/2, Srirama Complex
Chikkadapally
HYDERABAD - 20

and

Somepalli Venkata Subbaiah
Chandramathi Bhavan
Acharya Ranga Road
✆ : 08819 - 21292
TANUKU

Published by :
VIJAYALAKSHMI PUBLICATIONS
TANUKU

Designed & Printed by
VAMSI GRAPHICS
PALAKOL - 534 260
✆ : 08814 - 26680

అంకితం



మంచికి -
ఆ మనిషి మారుపేరు
మాటల్లో -
మానవీయత జాలువారు
చెలిమికి -
స్వచ్ఛమైన తొలిపిలుపు
అనుబంధానికి
అచ్చమైన మేలుకొలుపు
తీరు -
మూర్తీభవించిన క్రమశిక్షణ
పేరు -
తోటకూర వెంకటనారాయణ

వెన్నముద్దలు

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత
డా॥ సి. నారాయణరెడ్డి. ఎం.పి
ఎం.ఎ., పి హెచ్ డి డి లిట్
అధ్యక్షులు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక మండలి
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

కళాభవన్.
హైదరాబాద్ - 500 004
ఫోన్స్ (ఆ) 3214603
(ఇ) 3548451
ఫాక్స్ : (ఆ) 3214603
Date : 16-01-2002

అభినందన

కంప్యూటర్ యుగంలో తన కవితాసంపుటికి 'చల్లకవ్వం' పేరుపెట్టిన సోమేపల్లి వెంకట సుబ్బయ్యగారిలోని దేశీయత ప్రశంసనీయం. ఈ సంపుటిలోని కవితల్లో అడుగడుగునా దేశీయత ఎదురవుతుంది. మట్టి అంటే ఈ కవికి ఎంత ప్రాణమో "మట్టిని చుట్టుకుంటే" అనే కవితలో ఆత్మీయంగా ప్రతిఫలిస్తుంది.

"గొంతుపాటగా పల్లవించినా
రెక్కల సత్తువ శ్రమగా ప్రభవించినా
ఈ మట్టి చలవే"

ఈ పంక్తుల్లో వెంకటసుబ్బయ్యగారి హార్దిక శారీరక దృక్పథ ముద్ర కనిపిస్తుంది. అందుకే మట్టిపట్ల తనకున్న కృతజ్ఞతను

"మట్టి పొట్టలో
మళ్ళీ మనిషిగా పొటమరిస్తాను" అని ఆర్ద్ర మనస్కతతో ప్రకటించుకుంటాడు.

ఈ సంపుటిలోని "పోగు పేగునింపనివేళ" అనే కవిత నన్ను బాగా కదిలించింది. చేనేత బతుకులను అత్యాధునిక శైలిలో గుండెకు అంటుకునేట్టు చిత్రించాడు ఈ కవి.

వస్తువులో దేశీయత, ఆత్మీయత పొదుగుకుంటూ రచనారీతిలో అభివ్యక్తి తీవ్రతను ఎక్కుపెట్టిన కవితలెన్నో ఈ సంపుటిలో ఉన్నాయి. వెంకట సుబ్బయ్యగారు అందిస్తున్న ఈ కవితా సంపుటికి సముచిత స్పందన ఈ నా అభినందన.

అమృత మథనం

డా॥ నాగభైరవ కోటేశ్వరరావు
జాతీయ కవి, ప్రముఖ సాహితీ విమర్శకులు

తెలుగు కవితాలోకానికి -

సోమేపల్లి వెంకటసుబ్బయ్య తెలీనివాడేం కాదు.

మొన్న -

లుప్తమైపోతున్న మానవతా విలువలను గూర్చి మథనపడుతూ -

మనిషి దిగజారుడుతనానికి వగరుస్తూ -

"లోయలో మనిషి" అనే మినీపోయెమ్స్ కవితాసంపుటిని ప్రచురించాడు. ప్రగతిశీల కవుల్లో తన స్థానం సుస్థిరత చేసుకొన్నాడు.

కరుణ మాయమైపోతున్న సమాజాన్ని తలచుకొని ఆర్తితో - కఠిన దానవోగ్ర రక్తదాహం పెరిగిపోతున్న సంఘాన్ని తలచుకొని ఉక్రోషంతో -

రక్త దానానికి
మనుషులే లోటు
రక్త దాహానికైతే
మనుషులు కోటాను కోట్లు

- అని సోమేపల్లి వెంకటసుబ్బయ్య అన్నాడు

ఈ మధ్య - ప్రొఫెసర్ ఎన్.గోపీ 'నానీలు' అనే కొత్త కవితా ప్రక్రియను తెలుగు వనంలో నాటగా అది మొక్కగా మొలకెత్తి ఎదిగి, పుష్పించి దిక్కులకు సుగంధాన్ని పంపించింది. ఆ సుగంధం ఉక్కిరి బిక్కిరి చేస్తే ఆ దారినే ప్రయాణం చేసిన గుప్పెడు మంది కవుల్లో గోపీ నానీల తొలివారసుడు "గూడు వదిలిన గువ్వలు" కవి ఎస్.ఆర్. భల్లం తర్వాత వెంకట సుబ్బయ్య ప్రముఖులు అని చెప్పక తప్పదు.

నిన్న -

ఆయన 'తొలకరిచినుకులు' అనే పేరుతో శతాధికంగా 'నానీలు' ప్రచురించాడు.

పల్లె చెరువులో
తల్లి చేప
పట్నం ఎక్వేరియంలో
పిల్ల చేప -

వంటి ధ్వనిగర్భితమైన నానీలు కవితాప్రియుల్ని అలరించాయి.

'లోయలో మనిషి' తో కవితావనప్రవేశం చేసిన వెంకటసుబ్బయ్య ఈ 'తొలకరి చినుకులు' తో తన స్థానం పదిలపరచుకున్నాడు. పదుగురి దృష్టిలో పడ్డాడు. అభినందనలు అందుకున్నాడు. ఆశీస్సులు పొందాడు.

నేడు -

మీ చేతుల్లో ఉన్న 'చల్లకవ్వం' అనే వచన కవితా సంకలనాన్ని ప్రచురించి, తన సొంత గొంతు వినిపించాడు. తన సొంత ఒయాసిస్ చూపించాడు. తన నిండు హృదయాన్ని ఆవిష్కరించాడు.

• • •

పావులూరు మల్లన ప్రభవించిన మాగాణంలో ఎర్రన మెట్టిన సీమలో కర్షక కుటుంబంలో పుట్టి కవితా కుటుంబంలో కాలుపెట్టాడు వెంకటసుబ్బయ్య.

ఉద్యోగం రెవెన్యూలో ఉండేది కవితా ఎవెన్యూలో. తన నేపథ్యం పల్లె. తన బాల్యం పల్లె. తన మనసు పల్లె. తన హృదయం పల్లె. అందుచేత కవి తన చిన్ననాటి జ్ఞాపకాలను చేటలతో చెరిగిపోశాడు. పల్లెటూరి మట్టి పరిమళాన్ని పదపదంలో ప్రవహింపజేశాడు, ప్రసరింపచేశాడు. ఆ పల్లె సుగంధమే ఈ వచన కవితా సంకలనానికి అందం యిచ్చింది. ఆహ్లాదం తెచ్చింది.

• • •

రాజహంస పాలను నీళ్ళను వేరుచేసినట్టు -

మర్యాద రామన్న మంచీ- చెడులను వింగడించినట్టు -

పెరుగును చిలికి -

మజ్జిగనూ, వెన్ననూ వేర్వేరు చేసేది చల్లకవ్వం...!

కవ్వం చేసే పని కన్నతల్లి మనసూ చేస్తుంది.

కల్లలేని కవిత్వమూ చేస్తుంది.

సోమేపల్లికి తల్లి మనసు ఉంది. అమ్మమనసు లేనివాడు అచ్చపు కవిత్వం రాయలేడు. వెంకటసుబ్బయ్య విస్పష్టమైన కవితల్లజుడు. హిపోక్రసీ లేని ఇంగితం తనది. ఆత్మ జల్లెడ పట్టిన అక్షరాలే అతని పల్లె కవిత్వం.

• • •

గ్రామసేవకుల బాధ్యతాయుతమైన జీవితాన్ని పలకరించి, పరామర్శించే, జమాబందీయం కవితలో

చీకటి గుయ్యారపు పల్లెసీమల్లో
పుంతల్ని కంతల్ని స్పృశిస్తూ పరామర్శిస్తూ
ఎగుడు దిగుడు బాధ్యతల అరువుల బరువుల్ని మోస్తూ
మాసూళ్ళ కాలంలో తాసీలుకోసం తహతహలాడే
అతడెపుడూ నిత్యసేవా జాగృత దీపమే ...

అనే కవితాపంక్తులు అక్షరసత్యమని చెప్పక తప్పదు.

మట్టిని చుట్టుకుంటే కవితలో ...
మనసు అద్దంపై.
మట్టితనం నిత్యం పరిమళిస్తూనే ఉంటుంది

ఈ అక్షరాలు ఏకవి అయినా అనగలడేమో కానీ ...

గుప్పెడు మట్టిని తీసుకొని గుండెకి ఆనిస్తే
పూర్వీకం పట్టుతేనెగా ఊరుతుంది.
నాలో మట్టికాదు
మట్టిలోనే నేను పరమాణువై ప్రకాశిస్తాను.

అని వెంకటసుబ్బయ్యలాంటి భావుకుడు స్వాప్నికుడు మాత్రమే అనగలడు.

కాబట్టే -

జ్ఞాపకాల అలల్లో.... కవితలో

నా హృదయ క్యాలండర్లో పేజీల్లా దినగవు
నా నెత్తురులో కొత్తపూలు వికసిస్తూనే వుంటాయి.

- ఎన్ని ఉద్యమాలు వచ్చినా వ్యవస్థ మారడంలేదు అనే నగ్న సత్యాన్ని పై రెండు పాదాల్లో కవి ఎంత ధ్వనిగర్భితంగా చెప్పాడో గ్రహిస్తే ఈ కవిభావ ఔన్నత్యం ఎంతటిదో గుర్తించగలం.

క్యాలండరు పేజీ వ్యవస్థకు ప్రతీక ... నెత్తురులో క్రొత్త పూలు ఉద్యమాలకు ప్రతీక. ఎంత అపూర్వ భావన.

'ఎదురు నుదురుమీద' అనే కవితలో మూఢనమ్మకాలను వదలవలసిందిగా ప్రబోధం వుంది. దీన్లో ఉపదేశం ఉన్నంతగా కవిత్వం లేదని చెప్పక తప్పదు.

మట్టి కుదుపును
లెక్కగట్టే రెక్టరు స్కేలు
కన్నీళ్ళను కూడా కొలవగలిగితే
గుండె పగిలి చావదూ ఈ సైబర్ లోకం !?!

అని అత్యాధునిక కవిత్వావిష్కరణ చేయగలడీ కవి.

ఎయిడ్స్‌మీద తెలుగులో వచ్చిన కవితల్లో ఎన్నదగింది ఈ సంకలంలోని 'చమురు యింకిన దీపం'.

తరతరాల వంశవారసత్వానికి తానే సాక్ష్యమైన పట్టెమంచం -

అది క్రమంగా మరుగున పడి మాయమైపోతుంది. కాళ్ళకట్టన కూర్చున్నా కమ్మని కందిరీగై కలయదిరుగుతుంది **'ఆ నాలుగు పట్టెలే ...** అన్న కవితలో ఆవిరైపోతున్న మన ప్రాచీన సంస్కృతిపట్ల, ఆరిపోతున్న సంస్కారం పట్ల కవి ఆవేదన ప్రతీ అక్షరంలో సాక్షాత్కరిస్తుంది.

వ్యభిచార నేరంకాదు
పేదరికంలో ఒక ఆర్థిక అవసరం

అని లాజిక్‌గా సమర్థిస్తూ ధ్వనిపూర్వకంగా కవిత్వంపై కనిపిస్తాడీ కవి "అంగాంగ ప్రదర్శనలో" ...... కవితలో

అమ్మతనాన్ని
ఈరెర్ర మడతల్లో దాచేసుకున్నప్పుడు
అదశిశువు
అనునిత్యం వ్యాపారపు ముడిసరుకే
నోరులేని పశువులైతే గదా
బిడ్డల్ని అలగా పొదివి పెట్టుకోడానికి
తాతిపిల్లలయితేగా మురిపెంగా ముద్దు చేయడానికి

పశువుల్లోనూ, పక్షుల్లోనూ వున్న 'అమ్మతనం మనుషుల్లో మాయమైందని కన్నీటిని కలంలో పోసి కవిత్వం రాస్తాడు వెంకటసుబ్బయ్య **దత్తతబాల్యం** కవితలో.

తన చిన్ననాటి పల్లెటూరి "హార్మనీ" ను అక్షరీకరించిన కవిత **పల్లెపాదాలు**. పురుషాధిక్య సమాజానికి బ్లూప్రింట్ అనదగిన కవిత సమాంతరమా ... !

పసిరికపాముల్లా యింట్లోకి ఛానళ్ళు ఛానళ్లుగా ప్రవేశించిన టీవి, ఇంట్లో కంటిపాపలను, వంటిపాపలను వేధిస్తున్న వైనం చెప్పి

జీవనగమనం
వేగం పెరగడంతో
కుటుంబ సంబంధం
పుటుక్కున తెగిపోతుంది కదా ... !

అనే నిర్వేదంతో ముగిస్తాడు - **కళ్ళ ఛానళ్ళలో** ... అనే కవితలో

Oliver Goldsmith తన Deserted Village ...లో Village School Master గూర్చి ఒక పోయెం రాశాడు. అది మాస్టారుగారి అంతః బహిః చిత్రణలతో ఈనాటికీ ఉదాత్తమైన కవితగా ఆరాధింపబడుతుంది -

అలాగే వెంకటసుబ్బయ్య తన చిన్ననాటి స్కూలు మాస్టారు ఉదంతాలని కుప్పబోశాడు "అక్షరశిల్పి" కవితలో.

భద్రతా ఉద్యోగంతో
హుగు పల్లకీపై నేను ఊరేగడానికి
అలనాటి బోయీగా
కన్నబిడ్డలకంటే ఉనికరంతో
కళ్ళల్లో వొత్తులేసుకొనే సంస్కారం ...
వెంకటసుబ్బయ్యది. కృతజ్ఞతాభావం పద్యం నిలువెల్లా
తొణికసలాడింది.

డయాబెటిస్ మీద తెలుగులో మంచి కవితలే వచ్చాయి. గుర్తుంచుకొనే కవితల్లో ఎండ్లూరి సుధాకర్ తీపికోత ఒకటి, ఎస్.ఆర్.భల్లంగారి తియ్యనిదేహం మరొకటి. ఇప్పుడు వెంకటసుబ్బయ్య చక్కెర సర్పం అలాంటిదే.

వృద్ధాప్యాన్ని గూర్చి రాసిన "పండుటాకులు" అద్భుతమైన కవిత. కవితలో తీసుకొన్న ఉపమానాలన్నీ గ్రామీణ నేపథ్యంనుండి గైకొనడంతో కవిత్వ శిల్పానికి గౌరవం పెరిగింది.

ఈ "చల్లకవ్వం" కవితాసంకలనం -

మొత్తం మీద సోమేపల్లివారి బాల్యస్మృతుల రతనాల గని .. !

ధ్వనిగర్భితమైన కవితాధుని.... !!

ఇంకా చిక్కనిపాకంలో -

ఇంకా చక్కని శిల్పంలో ఈసారి సోమేపల్లివారు లాంగ్ పోయెమ్ రాస్తే చూడాలని వుంది.

• • •

దేవదానవులు మంథరగిరిని కవ్వంగా చేసికొని క్షీరసముద్రాన్ని మథించి అమృతాన్ని సాధించారు. మా వెంకటసుబ్బయ్య హృదయాన్ని కవ్వంగా జేసి సమాజసాగరంనుంచి కవితామృతాన్ని సంపాదించాడు. అందుకు వెంకటసుబ్బయ్య గారికి అభినందనలు అందిస్తూ ..

ఒంగోలు
6-3-2002

Nagabhairava

(నాగభైరవ కోటేశ్వరరావు)

కలం చిలికింది - ఇలా...

కలం పట్టుకొని కళ్ళు తెరుస్తున్న దశలో మొదటి సారిగా నా కంటికి 'లోయలోమనిషి' కనిపించాడు.

ఆ తరువాత -

ఇంకా ఏదేదో రాయాలన్న తపనలో-శీర్షం ఉడుకెత్తిపోతున్న వేళలో-నా కలం నానీల 'తొలకరి చినుకులు' కురిపించింది.

ఇదిగో ఇప్పుడు మళ్ళీ కలం చిలికింది-ఇలా చల్ల కవ్వమై.....

'పల్లె -బాల్యం" అంతా పచ్చగా కనిపిస్తుంది నాకు

బుడి బుడి నడకలతో ఆ స్మృతులన్నీ నాముందు గుత్తులుగుత్తులుగా పరిమళిస్తుంటాయి.

ఆటకీ పాటకీ - పవలు రాత్రి తెలీని ఆనందమయమైన బాల్యం గుర్తొస్తున్నప్పుడల్లా అందులో బడలికనంతా తీర్చుకొంటాను.

పుట్టింది పల్లెలో ... పెరిగిందీ పల్లె వొడిలోనే. అది ప్రకాశం జిల్లా యద్దనపూడి మండలం గన్నవరం. నను గన్న "వరం". పొలాలూ హలాలూ నా నేపథ్యాలు. అందుకే పల్లె నన్ను తల్లిలా హత్తుకొంటొంది నేటికీ. ఆ అనుభవాలూ, అనుభూతులూ, నన్ను పెనవేసుకొని ఇప్పటికీ నాతో గొంతు కలుపుతుంటాయి అవన్నీ అక్షరాలై నాతో ఆడుకొంటాయి. కవిత్వం బళ్ళో కాలుపెట్టింది మొదలు ఈనాటివరకూ నన్ను పలకరిస్తూ భుజం తడుతూ, ప్రోత్సహించిన పెద్దలెందరో ఉన్నారు.

- జ్ఞానపీఠంపై ఆసీనులై "చల్లకవ్వం" ను సాహిత్యాత్మకంగా అభినందించారు. నవనీత హృదయులు డా॥ సి. నారాయణరెడ్డిగారు.
- "అమృతమథనం" చేసి అందులో రుచులు వెలికితీసి పంచిపెట్టారు. కవితా "ప్రకాశం" డా॥ నాగభైరవ కోటేశ్వరరావుగారు.

- కాలాన్ని నిద్రపోనివ్వని నానీల నాన్న డా॥ ఎన్. గోపి ఇదిగో "చేయూత" అన్నారు.
- కవితా ప్రోత్సాహంతోపాటు, అనేకమంది మాన్యమిత్రులను సమకూర్చి పెట్టారు. సుప్రసిద్ధ కవులూ, కథకులూ శ్రీ రసరాజుగారు ఈ కావ్యాన్ని ముద్రించమని ఎప్పుడో వారు "హరిత సంకేతం" అందించారు.
- అభ్యుదయ కవులూ, సాహితీ విమర్శకులూ డా॥ అద్దేపల్లి రామమోహనరావు గారు ఈ కవితలు చదివి పదండి ముందుకు ... !! అన్నారు ...
- "నీటిభూమి" పై నిలబడి "చిగురుకేక" గా ప్రతిధ్వనించిన ప్రముఖ కవి 'నానీల అన్న' శ్రీ ఎస్.ఆర్. భల్లం ... ఈ పుస్తకం ఇలా వెలుగు చూడటంలో ఎంతగానో తోడ్పడ్డారు.
- ప్రముఖ సాహితీ విమర్శకులూ, కవి డా॥ ద్వా.నా. శాస్త్రిగారు ఈ సంపుటి త్వరగా రావాలని ఆకాంక్షించారు.
- వైద్యంతో పాటు - సాహితీ పోషణయే సేద్యంగా భావించే పిల్లల వైద్య నిపుణులు డా॥ వత్సవాయి వెంకటరాజుగారు ఈ కవితలన్నీ విని - కరచాలనం చేశారు ...
- నన్నయ్య భట్టారక పీఠాధ్యక్షులు డా॥ జి.ఎస్వీ. ప్రసాద్‌గారు రసహృదయంతో స్పందించారు ...
- ఈ సంపుటిలోని కవితలను ఇంతకుముందే పరిచయం చేస్తూ ప్రోత్సాహించారు - పత్రికాధిపతులూ, ఆకాశవాణి అధికారులూ ...
- వీరందరి గురించి నేనేం రాయగలను- ఒకే ఒక మాటలో కృతజ్ఞతాభి వందనలు నివేదించటం తప్ప ...

ఇంతకుముందే చెప్పినట్లు పల్లె - తల్లిలాంటిది నా దృష్టిలో ..

★ ★ ★

- అటువంటి పల్లెతనం - చల్లదనం - నిలువెల్లా నింపుకొంది మా అమ్మ నాగరత్నం ...
- ఆ అమ్మతనం అణువణువునా రంగరించుకున్నారు మా నాన్న సోమేపల్లి హనుమంతరావుగారు ...

  ఈ కావ్యంలో ప్రతి అక్షరం వారి వాత్సల్యానికి ప్రతిబింబమే -

  ఆ వాగర్థాలు రెండింటికీ నా ప్రణామాలు ...
- "చల్లకవ్వం"ను అంకితం తీసికొన్న "ఆత్మీయ బంధువు", చిలకలూరి సి. ఆర్. కళాశాలాధ్యాపకులు శ్రీ తోటకూర వెంకటనారాయణగారికి నా శుభాకాంక్షలు ! ...
- నేను ఒక మాట రాస్తే - పాటగా పాడుకొని పదే పదే పరవశించే అర్ధాంగి విజయలక్ష్మి ప్రోత్సాహం ఎప్పుడూ నాకు విజయాక్షరమే ! ఆమెకు నా శుభాశీస్సులు ! ...
- నన్ను చూసి - మేమూ రాస్తాం అన్నప్పుడు - చిరంజీవులు శ్రీ వశిష్ఠనూ, శ్రీ విశ్వనాథ విరించినీ అక్షరాలతో ముద్దుపెట్టుకుంటాను. ఆ చిన్నారులిద్దరికీ నా దీవెనలు ...
- ముద్రణలో ముచ్చట చూపించారు - వంశీగ్రాఫిక్స్ శర్మగారు ...
- ఆర్టిస్ట్ ఉదయ్‌గారు ముఖచిత్రాన్ని ముగ్ధమనోహరంగా చిత్రించిన ఆర్టిస్ట్ ఉదయ్‌గారు ...

  ఇరువురికీ ఈ సందర్భంగా నా కృతజ్ఞతలు ... !

- సోమేపల్లి వెంకటసుబ్బయ్య

జమా బందీయం

జనాభా లెక్కల దగ్గర్నుంచి
జన్మభూమి పనుల వరకూ
అందరికీ
అతడెపుడూ తక్షణ జవాబుదారీ

నీటి తీరువాను
నిఖార్సుగా "ఇర్సాలు" చేసే
నమ్మినబంటుతనానికి
అతడెపుడూ నిలువెత్తు రూపమే ...

ఊగిపోతున్న తలపాగానీ
జారిపోతున్న ముతక పంచెనీ సర్దుకుంటూ
జమా"బందీ" జాతరలో
"దస్త్రం" గరగను నెత్తిమీద పెట్టుకొని
"అయ్యా ... బాబయ్యా ..." అంటూ
ప్రతి పిలుపుకీ
అతి మర్యాద అతికించుకుంటూ
ఉడిగే ఉత్సాహానికి వూపిరి పోసుకుంటూ
చీకటి గుయ్యారపు పల్లెసీమల్లో
పుంతల్నీ కంతల్నీ స్పృశిస్తూ ... పరామర్శిస్తూ
ఎగుడు దిగుడు
బాధ్యతల అరువుల బరువుల్ని మోస్తూ
మాసూళ్ళ కాలంలో
రాసీలు కోసం తహతహలాడే
అతడెపుడూ నిత్యసేవా జాగృత దీపమే ...

కనలే పేగుల్నీ
కదలే ఆలోచనల్నీ సముదాయించుకుంటూ
సదలిపోని ఆత్మవిశ్వాసాన్ని పేనుకుంటూ
అలుపెరుగని
అతడెపుడూ అందరి తల్లోనూ అరిగే నాలుకే ....

చేసేది చిరుద్యోగమైతేనేం
చెలిమి కలిమిలోనే కాదు
నిత్య సేవాతత్పరతకి
నిరుపమాన చిరునామాయే అతడు

(యాభైఐదు వేలమంది గ్రామసేవకుల కోసం ...)

ఆంధ్రప్రదేశ్ మంత్రి - జూలై 1999

మట్టిని చుట్టుకుంటే ...

గొంతు
పాటగా పల్లవించినా
రెక్కల సత్తువ శ్రమగా ప్రభవించినా
ఈ మట్టి చలవే

తరతరాల నా వంశ వంగడం
చిగురించింది ఈ మట్టిలోనే ...

ఈ మట్టేగా
శాంతి సహనం వుగ్గుపాలుగా పోసింది
శక్తినంతా
ఇంధనం చేసి ప్రాణవాయువు నిచ్చింది ...

మనసు అద్దంపై
మట్టితనం
ప్రతినిత్యం పరిమళిస్తూ ప్రతిఫలిస్తుంది

గుప్పెడు మట్టిని తీసుకొని గుండెకి ఆనిస్తే
పూర్వీకం పట్టుతేనెగా వూరుతుంది
బుడి బుడి అడుగుల
బుజ్జారేకుల జ్ఞాపకం మొలకెత్తుతుంది
నాలో మట్టికాదు
మట్టిలోనే నేను పరమాణువై ప్రకాశిస్తాను

ఈ తల్లి మట్టిని
కళ్ళకద్దుకోవడంతో
నా దినచర్య మొదలవుతుంది
మట్టిపొట్టలో
మళ్ళీ మనిషిగా పొటమరిస్తాను

ఆంధ్రప్రదేశ్
మార్చి - 2000

ఎప్పుడూ మీరేనా ....

మీ ఇళ్ళముందు
కళ్ళాపి చల్లేదీ
మీ పిల్లల పారపళ్ళు తోమి
కాఫీలు తాపించేదీ

మీ గొడ్లకాడ
పేడకళ్ళు తీసి
ఎర్రని ఎండలో
కండల్ని కరిగించి నాట్లు వేసేదీ

ఎండిన డొక్కలతో
రెండుపూటలా మూడంకేసి బజ్జోనేదీ
మీ పక్కబట్టల్ని
చలువచేసి సర్దిపెట్టేదీ

మీ పిక్కల్ని నొక్కేందుకు
రెక్కలు ముక్కలు చేసుకునేది
మేమే ... మేమే ... మేమే ...!

రెక్క కొద్దిగా తప్పిందంటే
పెడరెక్కలు విరిచి
మరణశాసనం రాసేది
ఎపుడూ
మీరే ... మీరే ...! మీరే ...!

విశాలాంధ్ర
3-12-2000

జ్ఞాపకాల అలల్లో ...

పదిహేడో ఎక్కం తప్పుకు ....
పంతులోరు పెట్టిన తొడపాశమూ
బడి ఎగ్గొట్టి
ఊర చెరువులో ఈత కొట్టినప్పుడు
రుచి చూసిన
ఈత బెత్తం చురుకు చురుకు దెబ్బలూ
జ్ఞాపకాల అల్మారాలో చెక్కు చెదరలేదు !

అరలాగు అరచొక్కాతో
వీధి బళ్ళో చదువు
మీగడ తరగని మించిన కమ్మదనం

రెక్కలు విప్పుకుంటూ యౌవనారంభంలో
లెక్కకు మించిన
మధురానుభవాల దొంతర్లు

మది గదిలో మౌనశిల పగిలి
కేరింతల శబ్ద శకలాల మధ్య
నవ్వులాగో
పువ్వులాగో
విచ్చుకున్న పసిజ్ఞాపకం

ఉత్తుత్తి పరాచికపు ఆటల పోటీల్లో
బొంకిజెల్ల తినిపించిన ఆ పిల్లే
మళ్ళీ మళ్ళీ గుర్తొస్తోంది

ఐదుపైసలో
నువ్వులద్దిన జీడో టిక్కెట్టుగా తీసికొని
చాంతాండంత సినిమా కథ పొల్లుపోకుండా చెప్పే
చిన్ననాటి చిలిపి నేస్తాన్ని ఎలా మరుస్తాను?

అమ్మ ఆప్యాయతతో వండిపెట్టిన
అరిసెల్ని, పూర్ణం బూరెల్ని అక్క వాళ్ళూరు నడిచివెళ్ళి
ప్రేమతో పంచుకు తిన్న రోజులు

నా హృదయ క్యాలండర్లో పేజీల్లా చినగవు
నా నెత్తురులో
కొత్తపూలు వికసిస్తూనే ఉంటాయి

ప్రజాతంత్ర
17-12-98

ఎదురు నుదురు మీద ...

పేగు బంధమూ
స్నేహ సంబంధమూ
పెళ్ళి అనుబంధమూ
మూఢనమ్మకాల ముందు సంక్షిప్తాలేనా ... !
చెరుపు చేరువయ్యిందంటే
విధవరాలు ఎదురొచ్చిన ఫలితమేనా ...? !

చావుబతుకుల చదరంగంలో
ఊపిర్లూదిన అమ్మబొట్టు చెదిరిపోతే
అశుభాన్ని అంటిపెట్టుకున్నట్టేనా .....

ఎవరెస్టుపై జెండా నాటడానికి
టెన్సింగ్ నార్కే ఎవరు ఎదురొచ్చారు ....?
థెరిస్సా సేవాతత్పరతకి
ఎదురైన కట్టెల మోపు అడ్డంకి అయ్యేనా ...?

చికాగో ప్రసంగానికి
ఎవరు వివేకానందునికి ఎదురై ఆశీస్సులిచ్చారు ...

ప్రతి కదలికనూ పంచాంగాలే నిర్దేశిస్తుంటే ...
నల్లపిల్లి ఎదురొచ్చి ఏదో చేస్తుందని
నక్కి నక్కి చూస్తూ నడుస్తుంటే ...
వేగంగా నడిచే కాలాన్నీ,
విస్తరించే విజ్ఞానాన్నీ
అనుమానపు పిశాచి ఆవరించి
మంచి చెడ్డలకు
"ఎదురు" ను మించిన శకునం లేదంటారు
అదేం చిత్రమో ... !?!

విశాలాంధ్ర
1999

ప్రకంపనల ప్రవాహంలో ...

నమ్మకంతో నేలతల్లిని
కళ్ళకద్దుకునే వాణ్ణి ...

సామూహిక శవదహనాలూ
ఛిద్ర జీవితాల శిథిలాలూ
కాళ్ళకింద కంపనకీ
కోటిగుండెల్లో కొరకంచుకీ
అనవాళ్ళవుతుంటే

పరిమళించాల్సిన మానవత్వం
శవాలపై పైసలేరుకోడానికి
పరుగులెడుతుంటే

ఒక్క కుదుపు చాలదూ ...
కుటుంబాలు కుటుంబాలు కుళ్ళిపోడానికి
బంధాలకూ, బాంధవ్యాలకూ ఉప్పుపాతరెయ్యడానికి
బతుకు కుదేలవ్వడానికి ...

మట్టి కుదుపును
లెక్క కట్టే రెక్టర్ స్కేలు
కన్నీళ్ళను కూడా కొలవగలిగితే
గుండె పగిలి చావదూ -
ఈ సైబర్ లోకం !?!

గుజరాత్‌లోని భుజ్ భూకంపానికి కలతచెంది ..

వార్త 18-2-2001

చమురు యింకిన దీపం

ఆ నీడపడితే
బతుకు దీపంలో చమురు యింకి
చీకటి చిరంజీవత్వం పొందినట్లే ...

పరిచయాలూ
పలకరింపులూ
ప్రేమానురాగాలూ పేకమేడలయి కూలినట్లే ...

సూదులూ, సిరంజీలూ
చీమూ, నెత్తురూ వీర్యకణాలే కాదు
ఊహ, ఊపిరీ, ఉత్సాహం కూడ
అంటరానితనం అక్కున చేరిపోతాయి

చుట్టాల్నీ పక్కాల్నీ
సానుభూతికి ఆమడదూరంలో వుంచి
"అక్రమ" కథనాలకి ఆలంబనై
జవసత్వపు సైనికులపై జరిగే వైరస్ దాడికి
ఖండ ఖండాలపై
కారుచీకట్లు కమ్ముకొని నెర్రలు నెర్రలుగా విడిపోతాయి

హెచ్చైవీ పాజిటివ్ కరచాలనమే నిషేధమైపోతుంది
ఎందుకొచ్చిన చావు బతుకని
ఈసడింపుల వేదికవుతుంది

వ్యాధిసోకిన భయంతో
సానుభూతి చూపని సమాజపు గేలితో
చెదిరిన భవితతో
చెరువులో కలిసిపోతే
వాడి చరిత్రతో పాటు
ఆ నీళ్ళు కూడా మైలపడినట్లే ...

"ఎయిడ్స్" కోరల్లో చిక్కని బతుకెప్పుడూ
పచ్చదనంతో పరిమళించి ఫలవంతమౌతుంది

(ఎయిడ్స్‌బారిన పడ్డ అనేకులకోసం ...)

కవితా గోదావరి 1999

ఆ నాలుగు పట్టెలే ...

కుటుంబ కోర్టులో
కొలువు తీరిన న్యాయదేవతకి పీఠమయ్యిందీ
ఆప్యాయపు ఆరగింపులో
అతిథులకి ఆసనమయ్యిందీ
తరతరాల నుంచీ తనే కదా !

బుడి బుడి పాదాల మురిపాల ఆటలకీ
తడిపొడి పదాల విరుపుల పాటలకీ
రాగం తానం పల్లవి చరణాలు
ఆ నాలుగు పట్టెలే ...

పేనింది
తరతరాల ప్రేమతోనే కాబట్టి
ఆ నులక
మెలికలేని అనుబంధంతో పెనవేసుకుంటుంది
అల్లింది
అనురాగంతోనే కాబట్టి
నడుం వాల్చగానే
నిద్రతల్లి వొళ్ళోకి జార్చుకుంటుంది

తరతరాల వంశచరిత్రకి
వారసత్వపు భూమికగా
విరిగిన కుసిముక్క
తాతలనాటి తపనకి ప్రతిబింబమై పోతుంది

కాళ్ళ కట్టన కూర్చున్నా
కమ్మని కల కందిరీగై తిరుగుతుంటే
ఒత్తుకున్న తాళ్ళుకూడా
మెత్తని పరుపు వొత్తిళ్ళై హత్తుకుంటూ
"దాయిదాయి" మంటూ హాయినిస్తుంది ... !

చిల్లుల చిల్లుల అల్లికకి వొళ్ళంతా వొత్తిగిల్లదు
కాళ్ళ కట్టతాడు పీటముడి గుచ్చుకోదు

కరిగే కాలం పరుగులో
అది ఒరిగి విరిగిపోతూ
ముక్కలు చెక్కలుగా
మూలమూలకి నక్కిన
తరతరాల కుక్కి పట్టిమంచం

అదిప్పటికీ
మనో ముకురంలో మాత్రం
సు"దీర్ఘ" సుఖమయం
నిత్య నూతన కళామయం !!

విజేత

10-12-2000

పోగు పేగు నింపని వేళ ...

ఫ్యాషన్లు
క్షణానికో రంగు మార్చేస్తుంటే
మీటర్లు "షాక్" కొడుతున్నాయి

కూటికీ
బట్టకీ మొహం వాచిన
మగ్గం చక్రం
తుక్కుకింద అమ్ముడయి

నూలుపోగును నమ్ముకుంటే
పేగు నింపదన్న విషయం
నిజాయితీగా బైటపడిపోయింది.

తడిసిన పడుగులాంటి అప్పుల్తో
"సాలెగూడు" మార్కెట్లో
"నేతగాడు" అభిమన్యుడే అవుతున్నాడు

పొట్ట నింపని మగ్గం విద్యకు
చక్రవడ్డీల జబ్బులన్నీ జోడవుతుంటే
అతుకుల బతుకుల చేనేతలు
సుడిగాలిలో దీపాలై ... !?!

ఒక్క కిష్టయ్యా, లచ్చయ్యా, విశ్వనాథమే కాదు
మగ్గం చక్రం
ఏకబిగిన తిరుగుతూన్నా
బతుకు పగ్గం పుటుక్కున తెగిపోవడం
సర్వసాధారణమై పోయింది

సిరిసిల్లలో చితికిన చేనేత బ్రతుకులకోసం

ఆకాశవాణి - 18-7-2001

అంగాంగ ప్రదర్శనలో ...

అమ్మేదీ కొనేదీ
కొలతల్ని బట్టీ ...
కోరికల్ని బట్టీ ...

పేట్రేగే పేదరికం ఆకలి మంటల్ని రగిలిస్తుంటే
పేగు తెంచుకున్న బిడ్డ
పాలకోసం చింపిరి చాపమీద గుక్కపెడుతుంటే
వొంటిమీద
మొండికెత్తిన బండరాయి మురిపాల్ని వదిలించుకోలేక
చిక్కుతూ ... స్రుక్కుతూ ...

గుప్పెట్లోకొచ్చిన పచ్చనోటు మందుకో ... విందుకో ...
అర్థంకాని అయోమయం
వయసు మనసుల అదమాయింపులకూ
అప్రయత్నపు అరుపుల విరుపులకూ
అలవాటుపడని అమాయకపు నీడ
అడుగడుగునా
అంగాంగ ప్రదర్శనమౌతుంది

పరాయి కిరాయి కోరికల కోరల్లో
పచ్చి పచ్చిగా
నజ్జు గుజ్జు అవుతుంటే
పహరా లూటీ లారీ చప్పుళ్ళూ
గల్లీ మెహర్బానీ గదమాయింపులూ
సందట్లో సదేమియాలా
పీనుగులమీద పైసలేరుతున్నట్లు ...

గోదావరి గొంతుక

1999

బాడుగ జీవి

అక్కడ అతడిదే కర్రపెత్తనం
ప్రతికదలికా
అప్రమత్తంగా కనిపెట్టడమూ
అతిథి దేవుళ్ళను
ఎక్సరే కళ్ళు వేటాడడమూ
అతగాని దినచర్య

కన్నెపిల్లలుంటే బ్రహ్మచారులకు
నిషిద్ధ ప్రదేశమౌతుంటే
ఊరు
నిద్రకి ఉపక్రమించక ముందే
దీపం కింద క్రీనీడగా
సరిహద్దు రేఖకి బీగం బిగించి
చెక్‌పోస్ట్ డ్యూటీ చేస్తాడు

చిన్నారుల చిలిపి ఆటల సవ్వడీ ....
పంపు శబ్దమూ, పంఖామోతా
అణు విస్ఫోటనంలా
అతడి కర్ణభేరిమీద
కిష్కింధకాండ కిందే లెక్క ...

మేకు కొట్టినా, మిక్సీపెట్టినా
నవ్వినా తవ్వినా
తరతరాల అపరాధం తలకెత్తి పోసినట్టే

అత్తలేని కోడలే కాదు
ఓనరులేని ఇల్లే ఉత్తమమౌతున్నట్లు ....

ఆంధ్రభూమి వీక్లీ
25-2-1999

చెలిమి చిరునామా

చెట్టుకీ పిట్టకీ
అన్నానికీ ఆనందానికీ
నీకూ నాకూ ...

నీ కరస్పర్శ ఎపుడూ
చుట్టకుదురు మీద చల్లకుండే ...
పచ్చిక బయళ్ళలో బబ్బున్న హాయే ...

చిరుగుల చిక్కం సంచీలో
గంపెడు గంపెడు పుస్తకాల బరువుతో
చెట్టా పట్టా లేసుకొని
చెంగు చెంగున చేలగట్లమీద దూకే దృశ్యం -
ఇసుక దిబ్బలమీద
తూతూ మంత్రపు ఆటలో
దాంకొనే పూచికపుల్ల అయిపోదుగా ...

చింతపిక్కలూ, వామన గుంటలూ
నేలా బండా ఆటల పోటీల్లో
అరటిపండుగానో
అల్లిబిల్లి పాటల్లో బంగారు పిచ్చుకగానో
నెగ్గింది నువ్వయితే
విజయగర్వం వరించేది మాత్రం నన్నేగా ....

కళ్ళు నావైతే
ఆ కళ్ళల్లో నీళ్ళు నువ్వు
అందుకే
ఒక తల్లికి బిడ్డగానే కాదు
చెలిమికి చిరునామాగా పుట్టాలని ఆశ ...

ఆంధ్రప్రదేశ్ మంత్రి
సెప్టెంబరు 1999

దత్తత బాల్యం

ధర స్వల్పం ...
రాబడి అధికం ...
మానవీయత పీక పిసికేసే
ఇక్కడ వాణిజ్యం

ఆకలీ
అమాయకత్వమూ
తెరగా దొరగ్గానే
కిరాయి విక్రయ శిశుశాలల కళ్ళు ఎర్రబడ్డాయి

విదేశీ దత్తత
మనసు పొరల్లో విహరిస్తుండగానే
పసితనం
కాంపౌండ్ గోడల్లోనే గోరీ అయ్యింది

వంద కోసమో ...
వదిలించుకోవడం కోసమో ...
అమ్మతనాన్ని
కరెన్సీ మడతల్లో దాచేసుకున్నప్పుడు
ఆడశిశువు
అనునిత్యం వ్యాపారపు ముడిసరుకే

నోరులేని పశువులైతే గదా
బిడ్డల్ని అలగా
పాదివి పెట్టుకోవడానికి ...

కాకి పిల్లలైతేనే కదా
మురిపెంగా ముద్దుచెయ్యడానికి ...

ఇది మార్కెట్ -
ఇది మహేంద్రజాలం
కాసుల ఆశలకు కళ్ళెం పడనంతకాలం
పర్యవేక్షణల పగ్గాలు
మూన్నాళ్ళ మురిపమై
మూడు శిశువులూ ... ఆరు దత్తతలుగా ...

(దత్తతపేర ఆడశిశువు అమ్మకమౌతున్న నేపథ్యంలో)

ఆకాశవాణి 18-7-2001

పల్లె పాదాలు

పసిజ్ఞాపకం -
పల్లె గుండెకాయ మీద వాలగానే
చెలిమి కలిమి చిలక్కొట్టు కొడుతుంది

జొన్న గింజలు కొరకడానికి వాలే కాకిపై
మంచె మీంచి తోలడానికి
వడిసెల రాయిలా విసరబడే నాన్న
మంగలంలో జొన్న పేలాలు వేయించి
ఆబగా పేగుపొరల్ని తడిమే అమ్మా
రోగం రొస్టూ వచ్చిందంటే చాలు
పరుగెత్తి ఇంటికి వచ్చే గ్రామ చరకుడూ -
చదువుసంధ్యల్ని
ఆటపాటల వేడుకగా చేసిన
రామయ్య పంతులు బడీ
పండుగలూ పబ్బాలూ ...
పెళ్ళిళ్ళూ పేరంటాలూ ...
అందరూ ఒకటిగా చేసుకునే వూరిజనమూ

ఎవరి బాధయినా
తమ బాధనుకునే
ఆనంద క్షణాలూ ...

ఏం లాభం ... !?!
బాల్యం పక్క దులుపుకొని
యవ్వనపు రేకలు ప్రసరించగానే
కక్షలూ, వైరాలూ కారుమేఘాలుగా కమ్ముకొని
పసితనపు సూర్యుడ్ని
శాశ్వత గ్రహణం పట్టించడం
అదే భయంగా ...
అదే బాధగా ...

ప్రజాశక్తి
27-5-2001

సమాంతరమా ..... ! ?

గడియారంలో ముల్లూ
గానుగెద్దూ
అమే
సమానమైనప్పుడు
పాలు నీళ్ళ న్యాయం ఎండమావి కాక మరేమిటి !

కుటుంబ న్యాయస్థానానికి
ప్రధాన న్యాయమూర్తి "అతడే" అయినప్పుడు
వంటేం చెయ్యాలో
చదువేం చదవాలో
ఎవర్ని చేసుకోవాలో
ఎంతమందిని కనాలో
ఎలా పెంచాలో
చివరకు -
బతుకెలా వెళ్ళ మార్చాలో
మార్పులేని తీర్పునిచ్చేది అతడే ... !

అబల
సబల కానంతకాలం
గుడ్డిగా
అతడ్ని అనుసరించాల్సిందేనేమో ... ?

అంతేమరి
ఇక్కడ సమాన ధర్మమంటే ...
పేరు పక్కన
పేరు జతగా చేర్చడమే గొప్ప !

ఏకత
20-5-2001

ఫైలు కదలాలంటే ...

అరటావు కాగితం మీద
అంగుళం సంతకంతోటి
బతుకు అటో ... ఇటో ...

పేరుకు పోయిన ఫైళ్ళలో
సాలెగూళ్ళు అల్లిక పూర్తయినా
పెట్టుకున్న అర్జీకి
పునాది మాత్రం పడనేలేదు

అదిరే గుండెతో అరిగే చెప్పులతో
ఎన్నిసార్లు
మెట్లు ఎక్కిందీ, దిగిందీ
అయ్యోరికేం తెలుసు !!!

చింపిరితల పిల్లాడిలానే
ఫైలయినా .... లైఫయినా ...

చెయ్యి తడిస్తే
"నాట్ అప్రూవ్డ్" కాస్తా
"నోట్ అప్రూవ్డ్" అవుతుంటే
నియమాలూ నిబంధనలూ
నిశ్చబ్దంగా నిమ్మళంగా అక్కడ
బ్యూరోక్రసీ చెక్కిన శిల్పాలే ..

భావతరంగిణి
మార్చి 2001

కళ్ళ ఛానళ్ళలో ...

యాంకర్స్ విన్యాసాలూ
ఎపిసోడ్స్ వెర్రి మొర్రి వేషాలూ
మిడ్‌నైట్ మసాలాలూ
స్థితప్రజ్ఞుణ్ణి కూడా
స్థిమితం లేకుండా చేస్తుంటే
మనుషులు మనుషులుగా
మాట్లాడుకునేదెప్పుడు ...?

రెండు రెళ్ళు ఎంతని అడిగితే
కంప్యూటర్ మొహమే చూడాల్సిందే ... !?

"చింత" నిప్పు గుండెల్లో
ఎక్స్‌పోజింగ్ వేడిమి కొలిమి తీరుతుంటే

కంటిరెప్పల కప్పుల్లో
"యాంటెనా" ఎలుకలు పరుగులెడ్తాయి

పల్లెతనం
తల్లితనాన్ని కోల్పోతుంటే
బంధాలకూ,
అనుబంధాలకూ తెరదించాల్సిందే ...

వేడి ఈ-మెయిల్‌లో
పైరగాలివంటి
మనసు తడి తెలుస్తుందా ...

తెల్లారేసరికి
ఇంటర్నెట్‌లో
విహరిస్తావు సరే
ఇంట్లో సంగతి ఏమిటి ...?!

జీవనగమనం
వేగం పెరగడంతో
కుటుంబ సంబంధం
పుటుక్కున తెగిపోతుంది కదా !

ఛానళ్ళ చుంచల గెంతులనుంచి
ఎప్పుడు మన కళ్ళని కాపాడుకుంటామో కదా ... !!

ఆశావాది
18-7-2001

స్వార్థ హస్తం

నోరు పొగిడినా
నొసళ్ళలో మాత్రం వెక్కిరింతే ...

ఆ కళ్ళలోగిళ్ళలో
నిప్పులు కురవకపోయినా
ఆ పళ్ళలో
అసూయా విషం మరుగుతుంది

అడుగుతీసి అడుగు వేస్తే
స్వార్థ హస్తం
ఎదుటివాడి భుజాలమీద స్వారీ చేస్తుంది

మనసు పొరల్లో మెదిలేదొకటి
మాటల బాటల్లో తొడికేది మరొకటి

నింగి ఎత్తులో ఊహ
నేల వదిలి వేయని గంతు

అవసరం కోసం
అధికారులు చేతికింద వాళ్ళే దూదిపరుపు కావడం
దినచర్యలో అదనపు ఆకర్షణే

పిరికితనం గుండెల్ని పిండుతున్నా
గొంతులో సీమ టపాకాయ నటన

ఎన్ని తంటాలు పడ్డా
నమ్మించడం బ్రహ్మాతరం కానట్లు
అనంత కుతంత్ర సారం

నరనరాల్లో పుడికి పుచ్చుకొన్నట్లు
వేరెవ్వరూ సాటిరానితనం ప్రదర్శితమౌతుంటే ...
ఒంటరి "స్వ"భావం
శృతి మించి రాగాన పడ్తుంటే
అహంభావం
అణువణువూ తొణికిసలాడ్తుంటే ...
భేషజం
పరదాల్ని చీల్చుకోదు

మందిలో మహిషిగా కాదు -
మనిషిగా ఎప్పుడు మొలుస్తాదో కదా ...

ఆంధ్రప్రదేశ్ మంత్రి
ఫిబ్రవరి 2000

సమస్యల సాలెగూళ్ళలో

అక్కడ -
బతుకే అంత
క్షణం క్షణం భయం భయం
ఉద్రిక్తతల ఊహల ఉప్పెనంతా స్వార్థమయం

అల్లిన సాలెగూళ్ళలో
ఊసరవెల్లి కంటే వేగంగా
రంగుల బురఖాలు తొడుక్కొని
అరచేతుల్లో అదుముకొనే జీవన సౌందర్యం -
అరికాళ్ళ మీదకి జారిపోతుంది

కులాల కుమ్ములాటలో
మతాల మార్మిక హోమంలో
శాంతి కపోతాల రెక్కల్నుంచి
అవిశ్రాంతంగా నెత్తుటి వర్షం

పట్టెడు మెతుకుల కోసం
పొగ చూరిపోతున్న పసితనం మీద
హఠాత్తుగా
అమితమైన వాత్సల్యం పుట్టుకొస్తుంది

చిన్నప్పట్నుంచి
చెలిమితో చిగురించిన బతుకుతోట
కర్కశపాదం కింద నలిగిపోతుంటే -
స్వార్థం
ఆకాశహర్మ్యాల్లో కులుకుతూనే
నిరుపేదల ఆశాజ్యోతిలా వెలిగిపోతుంది

అక్కడ చదివేది
వసుధైక మంత్రం కావచ్చు
ఆచరణలో మాత్రం
అడుగడుగునా ఎండమావికి పర్యాయపదం

సర్దుబాటు విధానానికీ అవసరాల ఆలంబనకీ
కూడుపెట్టని కులమూ
గూడు చూపని మతమూ
గుండె కోర్టులో
ప్రత్యక్ష సాక్ష్యాలౌతుంటే
పరులకోసం పాటుపడని
బతుకుతోట
బీడైతేనేం - మోడైతేనేం !?

విశాలాంధ్ర
1998

పౌడె సంచి

గాలిలో ఎగురుతూ
శవాల కోసం ముసిరే రాబందులా
నాగటి కర్రుకి తగులుకుని
భూమిని కబళించే విషప్పురుగులా
ఆకలితో ఆవురావురు మంటూ అదిలిస్తుంది

నోరులేని పశువుల పేగుల్ని
వుండగా చుట్టి
ప్రాణంతీసే యమపాశమవుతుంది

ఆ సంచి -
శవం ముందు మోసుకెళ్ళే
నిప్పుల కుండలా భయపెడుతూ
కాసిని కాయగూరలో
చారెడు తినుబండారాలతో పాటు
మృత్యువు నీ వెంటబెట్టుకొస్తుంది

కాలిస్తే కేన్సర్‌కి మొలకవుతుంది
పూడిస్తే చిరంజీవత్వం పొంది
మనుగడకే చిచ్చుపెడుతుంది

వాడేసిన చెప్పుముక్కలూ
చెత్త కుండీలకు చేరిన బాటిల్సూ
ముస్తాబుకు ముడి సరుకులై
రీసైక్లింగ్ రింగుల్లో గింగిరాలు తిరిగి
రంగు-రంగుల చేతి సంచులుగా
అవతారమెత్తుతున్నప్పుడు

ప్లాస్టిక్ వాడకమంటే
మన "పాడె" ని
మనం బతికుండగానే సిద్ధపర్చుకోవడమే ...

నాగరికం మోజు బూజు దులిపి
ప్రకృతికి పట్టం కట్టనన్నార్రూ
గోనె సంచులు చేతి సంచులు కానేకావు
జన జీవితాల్లో
సహజత్వపు బతుకు పువ్వులు
పూయనే పూయవు

విశాలాంధ్ర
20-5-01

అక్షర శిల్పి

సుదూర తీరంలో నివసిస్తున్నా
నా చూపుల పొలిమేరలో
బడి కొట్టం ముందు
పేం బెత్తంతో నువ్వెప్పుడూ ప్రత్యక్షమే

బాల్యపు అనుభవాల పలకమీద
భద్రతా బలపంతో
భవిష్యపు అక్షరాలు దిద్దించింది నువ్వే

చింత బరికెతో శివాలించినా
తాడపాశంతో తోలు వలిచినా
మొట్టికాయలతో మోహరించినా
నాలో అంకురించిన అవలక్షణాలకి
గోడ కుర్చీ వేయించడానికే కదా !

సామెతలూ శతక పద్యాలూ
బట్టీయం పట్టించిన ఎక్కాలూ
సమస్యలెన్నింటికో
సత్వర పరిష్కామయ్యాయంటే నమ్ము

నాన్న పొలానికి పంపాడనో
తాత పొగాకుకాడ తెమ్మన్నాడనో
ఎగవేతకు ఎవర్నో బర్నో దోషిని చేసే
నాకళ్లతనాన్ని కనిపెట్టే జేమ్సుబాండ్‌వి

పిల్ల దండుని వెంటేసుకుని
బులి బులి నోళ్ళలో నలిగిన దసరా పద్యాలూ
వరహాల పప్పు బెల్లాలూ ఇప్పటికీ నోరూరిస్తున్నాయి

పైసా ఆశించకుండా
గొంతుని మైకు గొట్టం చేసుకొని
పంపిన అక్షర ప్రవాహంలో
తనివి తీరా తడిసిన క్షణాలూ ...

మొక్కల మొదళ్ళలో పాదులు తీయించి
అరకొర కూరగాయల్ని పండించడం
శ్రమదానం ఆనందానుభూతి చలవా నీదే ...

ఆటలపోటీలలో అసూయా మేఘాల్ని తొలగించి
ఐక్యతా కిరణాల వెలుగురేకల్ని అందించేది నువ్వే

భద్రతా ఉద్యోగంతో
హాయి పల్లకీపై నేను వూరేగడానికి
అలనాటి బోయీగా
కన్నబిడ్డలకంటె కనికరంతో
కళ్ళల్లో వొత్తులేసుకొని చదివించి సంస్కార గంధాన్ని
అణువణువూ పూసి వాసి కెక్కించింది నువ్వే

నీ అనంత ఆశయ ప్రవాహంలో ఈదుకుంటూ
ఆవలి వొడ్డుకు చేరుకున్న వాళ్ళలో
మొదటి అంకె నాది కావడం -
నీ ఆశీస్సు ఫలమే !

ఆంధ్రప్రదేశ్
మే 2001

చక్కెర సర్పం

ఆ పేరు వింటేనే
తీపులు తీపులుగా
జిహ్వా చాపల్యం కుదేలయిపోతుంది

ఓర్వలేకనో
వారసత్వపు వరసలోనో
ఆత్మీయపు గుండె గూట్లోకి
అప్రయత్నంగా జొరబడి
నంగనాచిలా నక్కి నక్కి
నరనరాల్నీ జీడిపాకంలా పట్టుకొని
జీవితాంతం "చిక్కి" శల్యం చేస్తుంది

ఆహార విహారాల్లో
స్వేచ్ఛా విహంగంగా ఒకప్పుడు ఎగిరిన మనసు
ఇప్పుడు ఈ తీపికోత
పహారా సైనికతనంతో
కాదూ - కూడదంటూ
కాపలా కాసుకోవాల్సి వస్తోంది
కడుపుని

ఏ మాత్రం ఏమారినా
ఈ సర్పం
కిడ్నీలను కాటేస్తుంది

గుండెల్ని జలగలా పిండేస్తుంది
సిరలకీ ధమనులకీ లడాయై
శరీరం సలుపుర్లు పెడుతుంది

చిటికెడు మెంతులో
కాసిని కాకరపిందెలో
మింగుతుంటేనే
బతుకు చెట్టుకు
చిగురాకు తొడుగుతుంది

బద్ధ శత్రువుకి కూడా
ఈ "చక్కెర" శాపం
వద్దు కాక వద్దు ... !

విజేత
17-06-2001

పండుటాకులు

అనుబంధాలు
ఆర్థిక బంధాలుగా మారి
సమాంతరంగా విస్తరిస్తుంటే
ఆత్మీయత
గుదిబండగా బరువవుతుంది

కడుపులో పిండం పడగానే
కాన్వెంట్ల కోసం పాకులాడినట్టు
కడుపు చించుకు పుట్టినతనం
కనీస కనికరాన్నే కరవు చేస్తుంది

కొంద్ర దున్నీ దున్నీ
కబేళాకి సిద్ధమవుతున్న
కంకాళాల్లాంటి
వట్టిపోయిన గొడ్డుకి
పచ్చిమేత దండగన్నట్టు
ఆచితూచి లెక్కలు గట్టే ఆత్మీయతల ముందు
అయాచిత యాతనలా
వంగి కుంగిపోతుంది వృద్ధాప్యం

నాగరికం పులుముకున్న ఆకతాయితనం ముందు
అనుభవాల సారం
చాదస్తపు సంస్కారగంధంపై అరిగిపోతుంది
పల్లె సుద్దులూ, నీతికథలూ
కర్ణకఠోరమై

చల్లతత్వం

బుల్లితెర సాక్షిగా
పిల్లల్ని చెడగొట్టే
పురాతన యంత్రంగా కన్పిస్తుంటుంది

పల్లె వాడికే
పండుటాకులు బరువౌతుంటే
ఫ్యాషన్ల బురఖాలు తగిలించుకున్న
సైబర్ నగరంలో
పగలూ రాత్రీ
వీధి వీధీ వృద్ధాశ్రమమే !?!

ప్రజాశక్తి
26-1-2002

హరిత శ్వాస

ప్రాణవాయువు నిచ్చే హరితశ్వాసల్ని
కరెన్సీ ఖడ్గం ఊచకోత కోస్తుంటే
సౌండ్‌ప్రూఫ్ గదిలో
కర్ణభేరి -
చిట్లించే కానుకగా స్వీకరించాల్సి వస్తోంది

అశల ఆకాశంలోకి
స్వార్థ పతంగం ఎగబాకుతుంటే
అత్యాశ ఇంధనంగా
ఫ్యాక్టరీ
ఛిద్రాల్ని జనారణ్యంలోకి వదులుతుంది

మనో కాలుష్యం
మానవ సంబంధాల పరిణామాన్ని కలిచివేస్తుంటే
గుండె గుటక నీట్లో
పూటపూటకీ
వ్యర్థ పదార్థాలు మిశ్రితమౌతుంది

క్లోరోఫ్లోరో కార్బన్లు
ఓజోన్ గొడుగును రంధ్రీకరిస్తుంటే
కాలుష్యపు సర్పం
ఖండఖండాలుగా కలుగుల్లోకి పాకుతోంది

నిర్మల నిశ్చల నీడల్ని
పెడతోవ పెడ్తున్న ఆలోచనలూ
అట్టడుక్కి దిగజారుతున్న సాంస్కృతిక విలువలూ

నరుక్కుంటూ పెరుక్కుంటూ
విశ్వాసాల ఒంటరి ఊసరక్షేత్రంలో
మట్టిమనిషి మసికావడానికి
అట్టేసేపు పట్టదుగాక పట్టదు ... !

ఆంధ్రప్రభ వీక్లీ
15-9-2001

కాగితపు బతుకు

సైకిల్ చక్రం తిరిగితేనే
అతడి జీవిత చక్రం తిరుగుతుంది

బక్కచారిన శరీరమైనా
పిక్కల్లో ఎక్కడలేని శక్తి ప్రవహిస్తుంది

రాత్రికి రాత్రే
అధికార పీఠాలు చీటలు వారినా
వందలాది జనం వూచకోతకు గురయినా
అత్యాచారాలనేకం హఠాత్తుగా అర్భాటించినా
అతనికి అవేమీ పట్టవు

ఒకరి ఇంటి తలుపుమీద "దబ్" మని శబ్దం చేస్తూనే
మరొకరి వరండాలో "ఉండ" గా విసిరేయబడతాడు

అమ్మకి కొనాల్సిన మందులూ
ఇంట్లో ఎదురయ్యే అవసరాలూ
చెల్లాయి పాలవొంటికి గౌనూ
ఎప్పుడూ కళ్ళల్లో సుళ్ళు తిరుగుతాయి

ఒక ఇంటినుంచి మరో యింటికి
అతడి జీవనకాగితపు నౌక
సహానుభూతి తీరంవైపు
నిరంతరం సాగుతూనే వుంటుంది.

భావతరంగిణి
జూన్-1999

బుడత బాల్యం

వసంతం వాళ్ళెరగరు
ఆగర్భ దరిద్రానికి
అయ్య చేసిన అప్పు అంటురోగమౌతుంటే
జీవనవనంలో గిడసబారిన పిందెలు వీళ్ళు

నారు పోసినోడు
నీరు కటాక్షించక పోవడంతో
బుడత బాల్యం
పాలగిన్నెలో దోబూచు జాబిల్లే ...

అమ్మతనంలో అమృతం యింకిపోకముందే
జీతగాళ్ళ జాబితాలో జమైపోతుంది
పుట్టిన కులమూ, పుట్టెడు అజ్ఞానమూ
దొరతనాన్ని వొత్తే దూది దిళ్ళవుతాయి

వెట్టి వూబిలో చక్రవడ్డీలతో
గొడ్లచావిడి తోడులేని గూడవుతుంటే
బతుకు బాధల బడవుతుంది

వెన్నుతట్టే నేస్తమూ
ఆదుకునే ఆప్తవాక్యమూ
అందని ద్రాక్షలై నోరూరిస్తుంటే
చిగుళ్ళు పళ్ళు ప్రసవించకపోయినా
చింతల చీడకు వాకిళ్ళు కాకూడదుగా ...

విశాలాంధ్ర
20-9-1998

ఊటబావి గట్టున ...

ఆ రోజులే వేరు
అడుగడుగునా ఆప్యాయత అడ్డుపడి ఆపేసేది
గొంతులో ఆపేక్ష గుండెలో పెనవేసేది

పిండారబోసిన వెన్నెట్లో
సులక మంచంలో పడుకున్న హాయీ
అమ్మఒడిలో పొందిన అనుభూతీ
తలపుల తలుపుల్ని తోసుకొచ్చేసేవి

రంగయ్య తాత నవ్వు జీర్ణ అనుబంధమూ
రత్తమ్మత్త చక్కిలాల మమకారమూ
మనసు మాగాణిలో
ఎపుడూ కళ్ళు తెరుస్తున్న విత్తులయ్యేవి

ఒంటరితనంలో వెనుకబడ్డ తెలియనితనాన్ని
వెతకబోయే అపూర్వ బాల్యం -
గాలి పల్లకీ మీద ఊరేగి
పైలా పచ్చీసు రాగ విభావరి ఆలపించేది

అమ్మా, అయ్యా, చెల్లీ తమ్ముళ్ళ కుశలప్రశ్నలతో
వరసైన వాళ్ళ సరస సల్లాపాలతో
మావూరు పండగ వాతావరణంలో మునిగితేలేది

మరో రోజు ...
వీధి అరుగుమీద
చుట్ట కాల్చుకుంటూ తీర్పులు చెప్పే పెద్దయ్య ఏడీ ... ?
ఊటబావి గట్టున
ఊదల మఱ్రితో ఊరేగిన నేస్తాలేరి?

ఊర చెరువులో
మునిగితేలిన గోచీలేని ఉత ఏది ...?
టెంకాయ పగిలితే చిమ్ముకొచ్చే నీరులా
స్వచ్ఛమైన స్వానుభవం ఏది?

కాంక్రీటు వనంలో
కార్బన్ మోనాక్సైడ్ కౌగిలిలో
ప్రాణవాయువు గిలగిలలాడుతుంటే
వ్యర్థ పదార్థాల పుక్కిట్లో నీరు
జీవ పరిమాణాన్ని నిర్జీవం చేస్తోంది

ఎన్నాళ్ళిలా ...
కాలుష్యపు ముళ్ళకళ్ళతో ఎదురుచూపులు?

"మా ఊరు" కవితా సంకలనం

'రంజని' సాహితీ సమితి - 2002

దిగ విడిచిన దిష్టిబొమ్మగా ...

నలిగిన తెలుగు వాచకమూ
పగిలిన అద్దం ముక్కా
అమ్మ పెట్టిన పప్పుచెక్కా
విరిగిన పలకా బలపమూ
చిరిగిన దుప్పటీ
కొక్కెం జారిన తాళం కప్పా

అప్పులు రాసిన ఉత్తరాలూ
యూనివర్సిటీ సర్టిఫికెట్లూ
ఇంటర్వ్యూ కార్డూ ...
మోసీ మోసీ
తుప్పు పట్టి చిల్లులు పడి ముసలిదయ్యింది

నాకు యౌవన దశ ...
దానికి అవసాన దశ ...
తూకానికి తక్కువ
పారవేతకు ఎక్కువ

అర్థమయ్యింది హఠాత్తుగా వేయి జారినట్లు
కోటప్ప కొండ తిరునాళ్ళలో కొన్న
పూల డిజైన్ ట్రంకుపెట్టె -
కూర్చునే పీటగా ...
దిగవిడిచిన దిష్టిబొమ్మగా ...

ఇప్పుడది
అటకెక్కి వెలవెలబోతుంటే
ఏదో తెలియని గుండె గుబులు
ఉన్న ఊరునీ కన్న పేగునీ
మరిచిపోయిన దిగులు

విశాలాంధ్ర
7-10-2001

ఉత్తరాయణం

అక్క పెళ్ళి
చిన్నిగాడు కళ్ళు తెరిచి -
తల్లి వొళ్ళో దోబూచులాడిన క్షణాలూ
కాలంచేసిన తాత కడసారి వైభవమూ
కావడిపెట్టె అడుగున భద్రంగా దాచిన
ఉత్తరాలేగా ప్రత్యక్ష సాక్ష్యం

అమ్మ రాసిన ఉత్తరం చదివితే
ఆకలనేదే తెలిసేది కాదు
సావాసగాడి చేతిరాత చూస్తే
ఆ ఉత్తరం మనసు అద్దంమీద
ఫ్రేము కట్టించుకోవాలనిపించేది

భుజానికి సంచీ
చెవిలో పెన్సిల్ ముక్కా
ఖాకీ దుస్తుల్లో గేట్లోంచి వస్తుంటే
మనసు చెలికాడినుంచి
మమతల పరిమళం గుబాళించేది

మాటల పల్లవి పూసల్ని
ఆశల సంచీలో మోసుకొచ్చి
గుండె తలుపులు తట్టేవాడు చుట్టంగా ...
"హలో" అలల మీద
ఊదులాడే కాలం వచ్చి
మాటలకి సెకండ్ల ముల్లు ఎరవేస్తుంటే
ముందుకీ వెనక్కీ వూగిసలాడే గొంతు
మూగబోతుంది

బ్రౌజింగ్‌ల, ఛాటింగ్‌ల ప్రవాహంలో
కొట్టుకు పోతూ పోతూ
ఇక ఏ క్షణంలోనైనా అడగొచ్చు
ఎవరైనా అడగొచ్చు
ఉత్తరం అంటే ఏమిటని ...?!
అందుకే -
దాన్ని అపురూపంగా దాచేస్తున్నా ... !?!

విశాలాంధ్ర
4-11-2001

పగ ఎవరిపైనో ... !?

విధ్వంస శిఖరంపై కూర్చొని
వినాశన ప్రణాళికలు
బడుగు బతుకులతో బంతులాటకేగా ...

పంటికి పన్నూ
కంటికి కన్నూ కూడా కాదు
ఆటవిడుపు కోసం
శరీరాన్ని తుంపులు తుంపులుగా చేసే
రాక్షస క్రీడోన్మాదం ...

దరీ లేదు
దిశా లేదు
మృత్యు సంగీతం ఆలపిస్తూ ...

మానవ బాంబుగానో
అమానవీయ ఆత్మాహుతిదళంగానో
మానవత్వపు జాడలు చెరిపి
రక్తపు డైన్మెట్లుని పేలుస్తుంది

నెత్తుటి మడుగులు
ఏరులు కట్టినా
నిప్పుల కళ్ళలో నీళ్ళు రాలవు
కసి ... మసి ...

జీవరసాయనంగా
కాగితపు కవర్లలోకి గుట్టుచప్పుడు కాకుండా దూరి
గుండెను శూలమై పొడుస్తుంది
పీలికలైన శరీరభాగాల్ని చూస్తూ
ఆనందమయంగా నాట్యం చేస్తుంది

పగ ఎందుకో ... ఎవరిపైనో ...
ఫలితం మాత్రం
శవాల కళ్ళాలు !
కన్నీటి సముద్రాలు !!

నేటినిజం రిపబ్లిక్ దినోత్సవ సంచిక
2002

జీవన సౌందర్యం

నడకా, నడతా, జీవన సౌందర్యం
అన్నీ గ్రంథాలే అవుతుంటే
సైన్సూ, సంగీతమూ
పురాణాలూ, పల్లె కబుర్లూ
కధలూ, కవిత్వమూ
కాదు కాదు
విశ్వమే కళ్ళముందుంటుంది

చిన్నా పెద్దా, ఆడా మగా
కులమూ మతమూ, కలిమీ లేమీ
అంతరాలకు అతీతంగా
అందరూ విద్యార్థులే అవుతారు

పుస్తక ఆలయంలో
వెలుగురేకల కోసం నిత్యహోమం
అక్షరమూర్తుల సాక్షాత్కారం
ప్రగతి బాటకు
అది వెన్నెల పురస్కారం

వెలుగు దిక్సూచిగా
భుజం తట్టే భరోసాగా
బాధ మరిపించే నేస్తంగా
పుస్తకమే అవుతుంటే
గ్రంథాలయమే నవీన దేవాలయం ...

విశాలాంధ్ర
27-12-1986

మౌన తంత్రులు

వడివడిగా దూకిన ప్రవాహం
ఒక్కసారిగా
మౌనపర్వతంలా మారిపోయింది
ఆలోచనం లావా భళ్ళున పెల్లుబుకుతుంది

మాటలన్నీ ఇప్పుడు మనసులోనే ...
నిశ్శబ్దం కరిన శిలలు పొరలుగా కట్టినా
స్వర చైతన్యం ప్రవహిస్తూనే వుంటుంది

చెలిమి చెలిమై సేవలు చేస్తుంటే
మౌనతంత్రుల్ని మాటలుగా పేని
మనసు పూసలన్నీ విప్పిస్తుంటే
నేను స్థితప్రజ్ఞుణ్ణి కాదు
నాకు మాట్లాడే మనిషంటేనే అవ్యాజమైన ప్రేమ

నిశ్శబ్దపు క్షేత్రంలో
కేరింతల కేదారమై
పుట్లు పుట్లుగా ధాన్యం పండిస్తాను
నేను నేనయితే చాలు -
పోరాటం ఆవిరైపోతుంది
కోల్పోయినతనం కొట్టుకుపోతుంది

ఇప్పుడిక మాటలన్నీ
మనసులతో కాదు
మనుషులతోనే ...

10-2-2002



CHALLA KAVVAM

SOMEPALLI VENKATA SUBBAIAH

మొన్న - లోయలో మనిషి
నిన్న - తొలకరి చినుకులు
నేడు - చల్లకవ్వం